నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
గురువారం 04 మే 2023

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

నవతెలంగాణ-భిక్కనూర్

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక సినిమా టాకీస్ చౌరస్తా వద్ద అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, తడసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకుని పోలీసులు వారిని శాంతింపజేసి రాస్తారోకోను విరమింప చేశారు. అనంతరం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 20 వేలు వెంటనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు అందే దయాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, చేపూరి రాజు, తాటిపాముల లింబాద్రి, కోటాను స్వామి, కిరణ్, మద్దూరి రవి, సిద్ధ గౌడ్ పాల్గొన్నారు.

అర్బన్ పార్కును పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ

నవతెలంగాణ-మాక్లూర్



మండలంలోని మామిడిపల్లి, చిన్నాపూర్ గ్రామ శివారులోని జిల్లా అర్బన్ పార్కును అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రియాంక వర్గీస్ బుధవారం పరిశీలించారు. ఆమెతోపాటు జిల్లా జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జిల్లా అటవీ శాఖ అధికారి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటీఎస్ శ్రీనివాస్, మాక్లూర్ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

తరుగు పేరిట దోపిడీ

- కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల బాలరాజ్



మాట్లాడుతున్న కాసుల బాలరాజ్

నవతెలంగాణ-కోటగిరి

తరుగు పేరిట అధికార పార్టీ నాయకుల, అధికారుల అండదండలతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాసుల బాలరాజ్ తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన ఉనికిని కాపాడుకోవడానికి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తున్నామని చెప్పినప్పటికీ, మండలంలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన నిర్వాహకులు దాన్ని కొనుగోలు చేపట్టడం లేదని రైతులు తమ గోడును ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు బస్తాకు కిలో తరుగుకు, రైస్ మిల్లర్లు క్వింటాలుకు నాలుగు, ఐదు కిలోలు తరుగు పేరిట రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని, అధికార పార్టీ నాయకులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై దందా కొనసాగిస్తున్నారని రైతులను ఆదుకుంటామని చెబుతున్న నాయకులు రైతులను నట్టేట ముంచుతున్నా, సంబంధిత అధికారులు సెలవుల్లో ఉండడం ప్రతి ఒక్కరికి అర్థమవుతుందని అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఒక రైస్ మిల్లు వద్ద మూడు రోజుల నుంచి లారీలో ధాన్యాన్ని తరుగు తీస్తున్నారని, దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని, మండలంలోని ధర్మకాంట వద్ద తూకంలో తేడా వచ్చిందని గుర్తించినా.. ఇప్పటివరకు నిర్వాహకులపై చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మొసలి కన్నీరు కారుస్తూ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో అధికారులపై చర్యలు ఏర్పడితే వాస్తవాలు బయటికి వస్తాయని, ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల నుంచి రైతుల ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. తరుగు పేరిట మోసం చేస్తున్న రైస్‌మిల్లర్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రైతులే దేశానికి వెన్నుముకని, రైతులు నష్టపోతే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ దేశాయ్, పార్టీ అధ్యక్షుడు షాహిద్, ఎంపీటీసీ కొట్టం మనోహర్, మాజీ జెడ్పీటీసీ, పోతంగల్ మండలాధ్యక్షుడు పుప్పల శంకర్, పట్టణ అధ్యక్షుడు అయూబ్, హైమద్, హనుమంత్, గోవిందరావు, సాయిలు, భూమన్న, ఖయ్యూం, హనుమంత్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి
- నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ మోడీగాం మహేష్



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

వరుసగా ఈదురుగాళ్లు, వడగండ్ల వాన కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎల్లారెడ్డి కోఆర్డినేటర్ మోడేగా మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బోనాల గ్రామంలో వడగండ్ల వాన ఈదురుగాల కారణంగా నేలరాలిన వరి పంటలను కొనుగోలు కేంద్రంలో వరికుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల రూపాయల పెట్టుబడులు పెట్టి అప్పులు చేసి యాసంగిలో వరి పంట వేస్తే ఈదురుగాళ్ల వడగండ్ల కారణంగా రైతులకు అపార నష్టం వాటిలిందన్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించగా పూర్తిగా తడిసి ముద్దయిపోయాయన్నారు. తడిసిన దాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా పంట నష్టం వాటిల్లిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని, రైతులను ఆదుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు సక్రమంగా సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులను గుర్తించి జిల్లా ఉన్నతాధికారులకు అందించాలని ఆయన అన్నారు. కామారెడ్డి జిల్లాలో లింగంపేట్ మండలంలోని 4600 ఎకరాలపైగా వరి పంట వడగండ్ల వానకు, ఈదురుగాళ్లకు పూర్తిగా నేలరాలిందన్నారు. వేలాది క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తడిసి ముద్దయిందని మొలకెత్తుతుందన్నారు. మొలికెత్తిన దానిని తక్షణమే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ కొమ్ముల లక్ష్మీనారాయణ, మంబోజిపేట రాజు, వడ్ల రమేష్, జగ్గయ్య నాయక్, అమృత రావు, రవీందర్‌రెడ్డి, పోశయ్య, సేవ్య నాయక్, రూపులా నాయక్, కిషన్, రైతులు తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రాజంపేట మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన ప్రభుదేవ్ రూ.2116 విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్ధిరాములుకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తమ వంతుగా విరాళం అందజేసిన దాతలను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపల్లి చంద్రం, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలను
ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సమ్మెకు పలువురి మద్దతు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఐకేపీ వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తమ డి మాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని వీవోఏలు తెలిపారు.

ఐకేపీ వీవోఏల సమ్మెకు సీఐటీయూ మద్దతు..

బోధన్ : తమ డిమాండ్ల సాధనకై సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలకు సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ నాయకులు బోధన్‌లో తమ మద్దతు తెలిపారు. సమ్మె శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత అనేక సందర్భాలలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు చేసి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా.. ఇప్పటి వరకు స్పందన లేదని అన్నారు. అందులో భాగంగా ప్రభుత్వ తీరుకు నిరసనగా నిరవధిక సమ్మె ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికైనా వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు నెలకు రూ.18వేలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాద బీమా సౌకర్యం, అర్హులైన వారందరికీ సీసీలుగా నియమించాలని, యూనిఫామ్ కేటాయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.10లక్షల కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐకేపీ జిల్లా నాయకులు పోశెట్టి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, ఐకేపీ మండల నాయకులు రమేష్, మహేశ్వరి, గంగాదేవి, లక్ష్మి, సరస్వతి, రమ, పంచశీల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : ఐకేపీ వీవోఏల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



రామారెడ్డి : రోడ్లు ఊడ్చి నిరసన తెలుపుతున్న వీవోఏలు

వీవోఏల సమ్మెకు సీపీఐ(ఎం) మద్దతు..

వర్ని : ఐకేపీ వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తమ డి మాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని వీవోఏలు తెలిపారు. బుధవారం తహసీల్దార్ విట్టల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద 10వ రోజు సమ్మెను కొనసాగించారు. వీవోఏల సమ్మెకు సీపీఐ(ఎం) ఉమ్మడి మండల కార్యదర్శి నన్నేసాబ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీవోఏలకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, ప్రస్తుతం రూ.3వేలు చెల్లిస్తుందని, దీనితో తమ కుటుంబాలు పోషించుకోలేని పరిస్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టే పనులలో తన వంతుగా భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. స్త్రీనిధి ద్వారా కమీషన్ కాకుండా ఐదు వేల రూపాయలు వేతనంగా ఇవ్వాలని, సీనియర్ వీవోఏలను సీసీ పోస్టులు ఇవ్వాలని, సాధారణ బీమా రూ.10లక్షలు కల్పించాలని అన్నారు. ప్రభుత్వానికి సానుకూలంగా చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం సహకరించి తమ డిమాండ్లను అంగీకరించి వేతనాలు పెంచాలని అన్నారు. ఈ సమ్మెలో చందూర్, వర్నికి చెందిన వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి నిరసన తెలిపిన వీవోఏలు..

రామారెడ్డి : జిల్లా కేంద్రంలో ఐకేపీ వీవోఏలు తలపెట్టిన మెరుపు సమ్మె బుధవారానికి 11వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా వీవోఏలు రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీవోఏల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పటాన్‌గౌస్ ఖాన్ మాట్లాడుతూ.. వీవోఏల న్యాయమైన, చట్టబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వీవోఏలను, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బాబాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సరిత రెడ్డి, విజయ్, తేలు బాలరాజు, అంకం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలకు మద్దతుగా సంఘీభావం తెలుపుతూ వారితో పాటు కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. సమ్మెకు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. అలాగే గాంధారి మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కామెల్లి బాల్‌రాజ్, లైని రమేష్, మదార్, బద్దం వెంకట్‌రెడ్డి, మోహన్ నాయక్, సంగెం రాజు, జశ్వంత్‌గౌడ్, బుక్య అనిల్, గోపాల్, దేవిసింగ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మహిళల అభ్యున్నతికి పాటుపడే ఇందిరా క్రాంతి పథకం మహిళా సంఘాలకు చెందిన వీవోఏలకు కనీస వేతనం రూ.18వేలు పెంచాలని, నేటి ఖర్చులకు అందిస్తున్న కనీస వేతనం రూ.3,900తో జీవనం కష్టంగా మారిందని, ప్రభుత్వం కనీస వేతనాలు పెంచాలని నిరసన కార్యక్రమంలో పేర్కొన్నారు. యూనియన్ అధ్యక్షురాలు సరిత, ఉపాధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి రమేష్, కోశాధికారి సుమ, సహాయ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.



వర్ని : మాట్లాడుతున్న నన్నేసాబ్



కోటగిరిలో..

స్పీకర్ ఆదేశం..
బీర్కూర్‌కు కదిలిన యంత్రాంగం

- పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-నసురుల్లాబాద్

పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్య, ఆరోగ్య సమస్య, అపరిశుభ్రతతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్టు బీర్కూర్ ప్రజలు స్పీకర్‌కు విన్నవించడంతో వెంటనే స్పందించిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీర్కూర్ మండల కేంద్రంలో పది రోజుల్లో పరిసరాల పరిశుభ్రత తాగునీటి సమస్య ఇతర సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించడంతో నేడు హుటాహుటినా మండల, డివిజనల్ అధికారులు బీర్కూర్ గ్రామానికి తరలివచ్చారు. దీంతో పాటు స్పీకర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేందర్ ప్రతాప్ బీర్కూర్ విచ్చేసి మండల స్థాయి అధికారులతో ప్రజాప్రతినిధులతో ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీర్కూరులో ముందుగా రహదారులన్నీ శుభ్రంగా ఉండాలని, గుంతలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ శాఖ అధికారులదేనన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పంచాయతీరాజ్ అధికారులు అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో ఇతర అధికారులు నిత్యం గ్రామంలో పర్యవేక్షిస్తూ గ్రామంలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. వారం రోజుల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విచ్చేసి అన్ని పరిశీలిస్తార ఆయన తెలిపారు. అందరూ సమిష్టి కృషితో బీర్కూర్ గ్రామంలో అపరిశుభ్రత లేకుండా చూడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను వారు పరిశీలించారు. వానకాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, కల్పించారు. వారం రోజుల్లో గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉండకుండా ప్రతి ఒక్క అధికారి చూపాలన్నారు. ఎవరు నిర్లక్ష్యం చేసినా తగు చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. శిక్షణ కలెక్టర్ శివేందర్ ప్రతాప్ బీర్కూర్ మండల కేంద్రంలో ఉంటారని ఏదైనా సమస్య వస్తే ఆయనను సంప్రదించాలన్నారు. వీరి వెంట ఎంపీపీ రఘు, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో భాను ప్రకాష్, ఎంపీఓ సునీత, మిషన్ భగీరథ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ ఆరోగ్య ఇతర శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.



ప్రకృతివనం వద్ద అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

ప్రకృతివనానికి తాళం..
వెనుతిరిగిన అదనపు కలెక్టర్..

బీర్కూర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో ఉన్న పరిసరాలను, ప్రకృతి వనాలను పరిశీలించడానికి వచ్చిన అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ప్రకృతివనానికి తాళం ఉండడంతో అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేందర్ ప్రతాప్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో భానుప్రకాష్ వెనుతిరిగారు.

మండల అధికారులతో సమావేశం అనంతరం కార్యాలయం ముందు ఉన్న ప్రకృతి వనాన్ని కలెక్టర్ పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో మరో ప్రకృతి వనం పరిశీలిస్తానని చెప్పడంతో అధికారులు అక్కడికి వెళ్లారు. ప్రకృతి వనానికి తాళం ఉండడంతో రెవెన్యూ సిబ్బంది తాళం పగలగొట్టడానికి ప్రయత్నాలు చేయగా తాళం పగలలేదు. దీంతో 'ఉండనిలే' అంటూ అదనపు కలెక్టర్ వెళ్లిపోయారు.

బీటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రం నుంచి అంతంపల్లి గ్రామానికి ఒక కోటి 67 లక్షల విధులతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పట్టణ సర్పంచ్ తునికి వేణు ఎంపీపీ గాల్ రెడ్డిలతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో బీటి రోడ్డు పనులు ప్రారంభించినట్టు తెలిపారు. గ్రామాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వ విప్‌కు గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతు రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు భూమయ్య, వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ నరేష్, రైతుబంధు మండల కన్వీనర్ రామచంద్రం, సొసైటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, పట్టణ మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పురం రాజమౌళి, నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

- మరో మూడు రోజులు వానలు
- నిజామాబాద్ వాతావరణ శాఖ అధికారి ఆశిష్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్



గుంతలమయమైన రోడ్డు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావం వల్ల నిజామాబాద్ జిల్లాలో బుధవారం సాయంత్రం 6 గంటలకు ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని నిజామాబాద్ వాతావరణ శాఖ అధికారి ఆశిష్ బుధవారం వెల్లడించారు. రానున్న 3 రోజులు నిజామాబాద్ జిల్లాలోను భారీ వర్షాలు పడనున్నట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించిందని వాతావరణ శాఖ అధికారి ఆశిష్ తెలియజేశారు. మే 6న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుందని, ఆ తర్వాత 48 గంటల్లో అల్పపీడనంగా మారుతుందని భారత వాతావరణ శాఖ పేర్కొందని తెలిపారు. మహారాష్ట్రలోని విదర్భ నుంచి తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతుండగా.. ఈ నెల 6 కల్లా ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే సూచనలు ఉన్నాయి. ఈ నెల 7 కల్లా ఆవర్తనం బలపడి అల్పపీడనం, వాయుగుండంగా మారే అవకాశం ఉండగా.. ఈ నెల 8 నాటికి మరింత బలపడి తుఫానుగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.



జలమయం..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సుమారు సాయంత్రం 6 గంటలకు భారీ వర్షం కురవడంతో కంఠేశ్వర్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గుంతలతో నీరు నిలిచింది. కంఠేశ్వర్, ఉమెన్స్ కాలేజ్ రోడ్డు, చంద్రశేఖర్ కాలనీలు నీటితో జలమయమయ్యాయి. గౌతమ్‌నగర్, దుబ్బా కెనాల్ కట్ట వైపు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ప్రజలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాదీముబారక్, కల్యాణలక్ష్మీ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాలకు చెందిన రూ.21,02,436 విలువగల 21 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు, అలాగే ఎమ్మెల్యే సొంత ఖర్చులతో ప్రతి లబ్దిదారులకు చీరను పంపిణీ చేశారు. అనంతరం ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలంలో రూ.13,53,700 విలువ గల 41 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన చెక్కులతో లబ్దిదారులు

చక్రధర్‌నగర్ తండాలో కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని చక్రధర్ నగర్ తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎ మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, జడ్‌పీటీసీ సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపిపి అన్నం సాయిలు, సర్పంచ్ హరి నాయక్, పిఎసిఎస్ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు

బాజిరెడ్డితో కలిసి కేటీఆర్‌ను కలిసిన ఎంపిపి



నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

హైదరాబాద్‌లో టీఎస్ ఆర్‌టిసి చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్దన్ తో కలిసి మంత్రి కల్వకుంట్ల తారకరామారావును ఎంపిపి భానోత్ ప్రేమ్ నాయక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామాబాద్ రూరల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి కేటీఆర్‌ను కలిశారు.

టీయూలో రగడ

- యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ నిర్మలదేవి నియామకం
- కొద్దిసేపటికే నియామకం రద్దుచేస్తూ ఓయూ రిజిస్ట్రార్ ఆదేశాలు



నిర్మలాదేవికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గతకొన్ని రోజులుగా తెలంగాణ యూనివర్సిటీలో వైస్ ఛాన్స్‌లర్, రిజిస్ట్రార్‌ల మధ్య నువ్వా.. నేనా.. అనే రీతిలో కొనసాగింది. టీయూ వీసి తన పంతం నెగ్గించుకుని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నిర్మలాదేవీ కి బుధవారం బాధ్యతలు అప్పగించారు. ఉస్మానియా యూనివర్సిటీ లో రిలీవ్ అయి నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ యూనివర్సిటీకి చేరుకుని టీయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్ది నిమిషాలకే హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆమె డిప్యూటేషన్‌ను రద్దు చేస్తున్నట్లు ఓయు రిజిస్ట్రార్ పేర ఉత్తర్వులు జారీ చేసిన విషయం వాట్సప్ గ్రూపుల్లో తెలంగాణ యూనివర్సిటీకి చేరింది. నిర్మాలదేవి తక్షణమే తిరిగి విధులకు హాజరు కావాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ అదేశాలు జారీ చేశారు. పరిపాలన కారణల వల్ల ప్రొఫెసర్ నిర్మలాదేవీకి మాంజురైన తత్కాలిక హక్కును రద్దు చేస్తున్నట్లు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఆర్డర్ క్యాన్సల్ చేసినా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన నిర్మలాదేవి

రిజిస్ట్రార్‌గా వెళుతున్న నిర్మలాదేవీని ఆర్డర్ క్యాన్సల్ చేసినప్పటికీ తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవిందర్ తో కలిసి టీయూకి వచ్చి రిజిస్ట్రార్ గా బాధ్యతలు స్వీకరించారు. టీయులో గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఓయు రిజిస్ట్రార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వీసీ మొండితనంతో వ్యవహరించి నిర్మలాదేవీకి రిజిస్ట్రార్ గా నియమించడంపై టీయులో తీవ్రంగా చర్చ జరుగుతోంది. దీంతో పాలక మండలి ఆగ్రహానికి లోనైంది. పాలక మండలి సమావేశంకు రాకుండ వీసీ చేస్తున్న చర్యల పట్ల సిరియస్ గా వారు పరిగనిస్తున్నారు.

గతవారం హైదరాబాద్‌లో యూనివర్సిటీ పాలకమండలి సమావేశం నిర్వహించి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న విద్యావర్ధిని తొలగించి ప్రొఫెసర్ యాదగిరిని పాలకమండలి సభ్యులు నూతన రిజిస్ట్రార్‌గా ఎన్నుకున్నారు. పాలక పాలక మండలి సమావేశంలో వైస్ ఛాన్సలర్ పాల్గొని ఇలా వచ్చి అలా వెళ్ళిపోయారు. పాలకవర్గం చేసిన తీర్మానాలు సబబు కాదని వైస్ ఛాన్స్‌లర్ వాదించారు. రిజిస్ట్రార్‌గా నియామకం అయిన నాటి నుండి నేటి వరకు రిజిస్టర్ వర్సెస్ వైస్ ఛాన్సలర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో నువ్వా నేనా అన్న విధంగా కొనసాగింది. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే చిరు ఉద్యోగులుగా నియామకం పొందిన వారందరినీ తొలగించి యూనివర్సిటీకి రావద్దని ఆదేశించారు. అనేకసార్లు విమర్శలు వచ్చిన ఏ ఒక్క అధికారి పట్టించుకుని విచారణ చేసిన దాఖలాలు లేవు. ఇదే కాకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉన్న వారిని ప్రొఫెసర్లుగా, వైస్ ఛాన్సలర్‌గా పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు పొందిన వారందరికీ పదోన్నతులు సైతం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తెలుగు విభాగానికి ప్రొఫెసర్‌గా ఉన్న బాల శ్రీనివాసమూర్తి గుండె నొప్పితో హఠాన్మరణం పొందారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ రవిందర్ పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ బాల శ్రీనివాసమూర్తి మృతికి రిజిస్టర్‌గా ఉన్న యాదగిరి ప్రొఫెసర్ పదోన్నతి రద్దు చేయడమే కారణమని తీవ్ర ఆరోపణలు చేశారు.

పాలకమండలి సమావేశం నిర్వహించిన తర్వాత వైస్ ఛాన్సర్ తెలంగాణ యూనివర్సిటీకి ఒకరోజు వచ్చి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆనాటి నుండే రిజిస్ట్రార్‌ను తొలగించే పనిలో నిమగ్నమయ్యారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉద్యోగం నుండి తొలగించిన వారందరూ వీసి వద్ద వచ్చి తమ గతి ఏం కావాలని మొరపెట్టుకున్నారు. దీంతోనే ఆగకుండా టీయూలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూ ముందుకు సాగారు. ఎట్టకేలకు వైస్ ఛాన్స్‌లర్ హైకోర్టుకు వెళ్లి కేసు వేశారు. వైస్ ఛాన్సలర్ నిర్ణయం శిరోధార్యమని, పాలకమండలి నియమించిన రిజిస్ట్రార్ యాదగిరి కొనసాగవద్దని వైస్ ఛాన్సలర్ వాదిస్తున్నట్టు యూనివర్సిటీలో ప్రచారం జరుగుతోంది.

పాలకమండలి అనుమతి లేకుండానే వైస్ చాన్స్‌లర్ నిర్ణయాలు తీసుకోవడం, నియామకాలు చేపట్టడం, ఖర్చులు చేయడాన్ని పాలక మండలి తీవ్రంగా పరిగణించింది. వైస్ చాన్సలర్ లేకుండానే పాలకమండలి సమావేశాలు ఈసీ నిర్వహిస్తుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ నెల 26న జరిగిన ఈసీ సమావేశంలో కఠినమైన చర్యలకు పూనుకుని పలు నిర్ణయాలు తీసుకునే వరకు వెళ్ళడం విశేషం. యూనివర్సిటిలో వృక్షశాస్త్రం ప్రొఫెసర్ విద్యావర్ధిని రిజిస్ట్రార్ విధుల నుంచి సస్పెండ్ చేస్తూ పాలకమండలి తీర్మానించింది. పాలకమండలి అనుమతి లేకుండా ఇన్చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన విద్యావర్ధిని పదవీకాలాన్ని గుర్తించేది లేదని పాలకమండలి నిర్ణయించింది.

ఒక్క రూపాయి ఖర్చు చేసినా చర్యలు తప్పవు టీయూ పాలకమండలి సభ్యులు

తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన రిజిస్ట్రార్ నిర్మలాదేవీ టియు గ్రాంట్ నుంచి ఒక్క రూపాయి ఖర్చు చేసినా పాలకమండలి సహించదని రిజిస్ట్రార్ నిర్మలాదేవీకి అసలు రిజిస్ట్రార్ గా పాలకమండలి ఆమోదం లేదని ఎలా బాధ్యతలు స్వీకరిస్తారని పాలకమండలి సభ్యులు గంగాధర్ గౌడ్ ప్రశ్నించారు. తెలంగాణ యూనివర్సిటీ పరువును టియు వీసీ " తీస్తున్నాడని, మొండిగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. బుధవారమే ఆమెకు బాధ్యతలు అప్పగించి బ్యాంకులో చెక్కులు డ్రా చేసేందుకు ఏలా అధికారం ఇస్తారని ఆయన ప్రశ్నించారు. నిర్మలాదేవి రిజిస్ట్రార్ గా వెళ్లవద్దని ఉస్మానియా యూనివర్సిటీ ఆదేశించినప్పటికీ ఫోన్ స్విచ్చాఫ్ చేసి యూనివర్సిటీకి రావడం తగదన్నారు. వీసీ చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఇలాంటి నాటకాలు ఆడుతున్నారన్నారు. తక్షణమే ఆయన పదవీకి రాజీనామా చేయాలన్నారు. పాలకమండలి సభ్యులు నిర్ణయం మేరకే రిజిస్ట్రార్ యాదగిరిని రెండేళ్ల పాటు పదవీలో కొనసాగేలా పాలకమండలి సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు వారు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ డైరెక్టర్లు

నవతెలంగాణ-ముప్కాల్

వేంపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రంను సొసైటీ డైరెక్టర్లు తోటి రైతులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సొసైటీ సభ్యులు బద్దం సాగర్ రెడ్డి, జైడి రవి రెడ్డి మాట్లాడుతూ... రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ-గ్రేడ్ ధర రూ 2060, బి- గ్రేడ్ ధర రూ 2040 రూపాయలుగా నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ మారెల్లి విష్ణు, ఎంపీటీసీ సభ్యులు వెంకట్ రాజ్, సొసైటీ డైరెక్టర్లు నేర బాబ్ రావ్, మల్కన్న, సొసైటీ సెక్రటరీ వంశీకృష్ణ, అశోక్, కొత్తపల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.

వివోఏల నిరవధిక సమ్మె



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వీవోఏలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొద్దిరోజులుగా మండల సమాఖ్య కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన ఐకేపీ వీవోఏలు బుధవారం 63వ నంబర్ జాతీయ రహదారి పక్కన అంబేద్కర్ విగ్రహం వద్ద టెంట్ ఏర్పాటు చేసుకొని నిరధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వివో ఏలు మాట్లాడుతూ తమకు కనీస గౌరవ వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలన్నారు. వివో ఏలకు 10 లక్షల సాధారణ బీమా , ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. గౌరవ వేతనం డిఆర్డిఎ నుండి నేరుగా వీవోఏల బ్యాంక్ అకౌంట్ లోనే జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఐకేపీ వీఓఏల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నాగంపేట్‌లో కొమురం భీం విగ్రహం ఏర్పాటు



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నాగంపేట్ గ్రామంలో కొమురం భీం విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. జిల్లా నాయకపోడు సేవా సంఘం అధ్యక్షులు గడ్డం శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల రామచందర్ సమక్షంలో సంఘ సభ్యులు కొమురం భీం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకపోడు సేవా సంఘం అధ్యక్షులు గడ్డం శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల రామచందర్, సర్పంచ్ రాజవ్వ, ఎంపీటీసీ సభ్యులు మేడిపల్లి మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు దాసరి గంగాధర్, మండల సేవా సంఘం అధ్యక్షులు పుట్ట రాజేశ్వర్, నాయకులు మెట్టు రాజేశ్వర్, లింగన్న, గోపి, ఆదివాసి నాకపోడు సంఘం సభ్యులు ఐలాపురం మహేష్, బోన్ల శ్రీకాంత్, పుట్ట ముత్తన్న, పుట్ట ముత్యం, గణేష్, గాండ్ల సాయన్న, మదనపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భాజాభజంత్రీలతో వీవోఏల నిరసన



సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

నవతెలంగాణ-ముప్కాల్

వీవోఏలు తమ డిమాండ్ల సాధనకై చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ముందు సమ్మెను కొనసాగించారు. భాజా, భజంత్రీలతో విన్నూతంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముప్కాల్ మండల అధ్యక్షురాలు అరుణ, వీవోఏలు మంజులత, కళావతి, భాగ్యలక్ష్మి, కావ్య, అర్చన, రాధిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన సర్పంచ్



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ లావణ్య

నవతెలంగాణ-ఏర్గట్ల

అభివృద్ధిలో భాగంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి కృషితో 5 కోట్ల నిధులతో దాదాపు పూర్తి అవుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను, రోడ్డు విస్తరణ పనులను సర్పంచ్ గుల్లె లావణ్య గంగాధర్ బుధవారం పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి అయ్యాయని, కొద్దిపాటి మిగిలిన పనులను పూర్తి చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని ఆమె తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మిషన్ భగీరథ పైప్ లైన్ ఒక పక్క డ్యామేజ్ అయ్యిందని, వాటిని సరి చేయిస్తున్నామని, ప్రజలకు నీటికి అంతరాయం లేకుండా చేస్తామని ఆమె తెలిపారు.

మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్
- జిల్లా జైలు నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడాన్ని అందరూ అలవాటుగా చేసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్‌డి ప్రియాంక వర్గీస్ సూచించారు. బుధవారం ఆమె కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీఎఫ్ఓ వికాస్ మీనా తదితరులతో కలిసి నిజామాబాద్ జిల్లా జైలులోని నర్సరీని సందర్శించారు. అలాగే ఎడపల్లి మండలం కుర్నాపల్లిలోని హరితహారం నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. నర్సరీలను చక్కగా నిర్వహిస్తుండడం పట్ల నిర్వాహకులను, సిబ్బందిని అభినందించారు. నర్సరీలో పెరుగుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీని నిర్వహిస్తున్న సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. జిల్లా జైలులో సింగపూర్ చెర్రీ రకం చెట్లు ఉండడాన్ని గమనించిన ఓఎస్‌డి, జైలు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఏపుగా పెరిగి గొడుగు తరహాలో చక్కటి నీడను అందించే సింగపూర్ చెర్రీ మొక్కలను ప్రధాన రహదారులకు ఇరువైపులా విరివిగా నాటించాలని జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాకు సూచించారు. ఈ చెట్టు ఏడాది పొడుగునా పూలు, చిన్నచిన్న పండ్లను అందిస్తుందని, ఫలితంగా పక్షులకు ఆవాసంగా ఉపయోగపడుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా జైలులో ఖైదీలు, అండర్ ట్రయల్ ముద్దాయిలకు అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి ఆరా తీశారు. ఖైదీలు తయారు చేస్తున్న ట్రీగార్డులు, బుక్ బైండింగ్, ప్రింటింగ్ సామాగ్రిని పరిశీలించి చక్కగా పనిచేస్తున్నారు అంటూ వారిని ప్రోత్సహించారు. కుర్నాపల్లి పల్లె ప్రకృతి వనం పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండడాన్ని చూసి స్థానిక సిబ్బందిని మెచ్చుకున్నారు. ఇకముందు కూడా ఇదే తరహాలో మరింత సమర్థవంతంగా నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను నిర్వహించాలని సూచించారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో గ్రామ గ్రామాన ఏర్పాటైన పల్లె ప్రకృతి వనాలను నీతి ఆయోగ్ సంస్థ కూడా ప్రశంసించిందని ఈ సందర్భంగా సిఎంఓ ఓ ఎస్ డి ప్రియాంక వర్గీస్ గుర్తు చేశారు. ఆమె వెంట డీఆర్డీఓ చందర్, జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్ రాజశేఖర్, ఆర్డీఓ రవి తదితరులు ఉన్నారు.

విప్లవ పార్టీలు నేలవిడిచి సాము చేయకూడదు

ప్రజాపంథా రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కార్మిక వర్గం అశేష ప్రజా నికం పాల్గొనకుండా విప్లవాలు సాధించలేమని, ప్రజల తక్షణ ప్రజాస్వామ్య హక్కులు అమలు స్థితిని చూడకుండా విప్లవ పార్టీలు స్వీయ కార్యక్రమం రూపొందిచడం అంటే "నేలను విడిచి సాము" చేయడమేనని ప్రజాపంథా రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్ అన్నారు. "175 సంవత్సరాల కమ్యూనిస్టు మేనిఫెస్టో భారత విప్లవానికినేటికీ ప్రాధాన్యతపై 5న కలకత్తాలో జరిగే సెమినార్‌కు బయలుదేరిన సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమం నేటి ప్రాధాన్యత అనే అంశంపై సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీతోపాటు 4 విప్లవ పార్టీలు దేశంలో ఉన్న నేటి పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ పంథా, విప్లవ కార్యక్రమాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజా పంథా మాస్ లైన్, రాజకీయాలతో ఏకీభవించే విప్లవ పార్టీలతో ప్రజా పంథా దేశవ్యాప్తంగా బలమైన పార్టీని నిర్మించాలని కృషి చేస్తుందని అన్నారు. దేశంలో ఉపాధి లేని స్థితి, ఆహారం లేక గూడు లేక, కనీస ప్రజాస్వామ్య హక్కులు లేక జీవిస్తున్న ప్రజలకు కమ్యూనిస్టు పార్టీల అవసరం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల చైతన్యాన్ని ప్రజల తక్షణ అవసరాన్ని పోరాటలతో పాటు ప్రజా తంత్ర విప్లవం సాధన కోసం ఉద్యమించాలని అన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ విప్లవాలు విజయవంతం కావని అన్నారు. ఈ కలకత్తా సెమినార్ లో పాల్గొంటున్న విప్లవ పార్టీ లు ప్రజల ఆశయాలు శాస్త్రీయ మార్క్సిస్ట్ ప్రజా పంథాను నిర్మించడం కోసం విప్లవకారులు ఒక బలమైన పార్టీ ఆవశ్యకతను గుర్తు తెస్తుందని అన్నారు. ఈ సెమినార్‌కు నిజామాబాద్ జిల్లా నాయకులు బి దేవరాం, పి రామకృష్ణ, ఎం ముత్తెన్న, బి మల్లేష్, నాయకులు, కే రాజేశ్వర్, ఆర్ రమేష్, బి.కిషన్, ఎం.నరేందర్ వెళ్లారు.

వడ్డెర వృత్తిదారులు ఐక్యతతో ముందుకు రావాలి

సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఇడగొట్టి సాయిలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

వడ్డెర వృత్తిదారులు ఐక్యతతో ముందుకు రావాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఇడగొట్టి సాయిలు అన్నారు. రామచంద్రపల్లి ఒడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇడగొట్టి సాయిలు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాసంఘాల ఐక్యత తోటి ఎర్రజెండా సహకారంతో మన చట్టాలను మనం కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అందుకోసం అందరూ ఒక్కటై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాక్లూర్ మండలం రామచంద్రపల్లి గ్రామంలో వడ్డెర వృత్తిదారుల ఐక్యత గురించి ప్రస్తావించారు. గ్రామంలో పోరాటం వల్ల ఇళ్ల స్థలాలు, పట్టాలు, నీటి సౌకర్యం, రోడ్డు, రవాణా సౌకర్యం వంటివి ఎవరో ఇచ్చినవి కావని పోరాట ఫలితంగానే సాధించుకున్నారని గుర్తుచేశారు. ఇదే స్పూర్తితో వడ్డెర వృత్తిదారులు ఐక్యమత్యంతో ముందుకు వచ్చి మేడే ఉత్సావాలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు, పెద్ది వెంకట రాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో లక్కీ ద్వారా ఐదుగురు ఎంపిక

నవతెలంగాణ తాడ్వాయి

హైదరాబాదు పబ్లిక్ స్కూల్ (బేగంపేట్, రామంతపూర్)లో 2023-24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశం కోసం గిరిజన విద్యార్థులకు ఐదు సీట్లు కేటాయించారు. వీటిని లక్కీ ద్వారా ఎంపిక చేయగా బుధవారం కామారెడ్డి కలెక్టరేట్లు జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. ముగ్గురు బాలికలను, ఇద్దరు బాలురను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. యశస్వి, కృతిష, సోక్రియ, రేవంత్ కుమార్, మిథున్ నాయక్ ఎంపికయ్యారు.ఎస్సీ విద్యార్థులకు రెండు సీట్లు కేటాయించారు. లక్కీ డ్రా ద్వారా కృతిక్ , అఖిలేష్ అనే విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రైతు ప్రభుత్వం.. అందరినీ ఆదుకుంటాం..

- ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్
- రావుట్లలో పంటపొలాలు పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-సిరికొండ

నిజామాబాద్ రూరల్‌లో అకాల వర్షాలతో జరిగిన పంటనష్టాన్ని ధర్పల్లి జెడ్పిటిసి, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ బుధవారం పరిశీలించారు. మండలంలోని రావుట్లలో పంట పొలాల మధ్య రైతులతో కలిసి ఆయన నష్టం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిహారం ఎకరాకు పదివేలు ఇస్తామని భరోసా ఇచ్చారు. తడిచిన ధాన్యాన్ని కొంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. ప్రత్యామ్నాయ పంటలుగా ఫామాయిల్ సాగు వేసుకోవాలనిసూచించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఫామాయిల్ లాంటి పంటల సాగుకు మన నేలలు ఉపకరిస్తాయని వివరించారు. ప్రతిపక్ష పార్టీలు వచ్చి ఏవేవో కారుకూతలు కూస్తాయని, అవన్నీ పట్టించుకోవద్దన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏదో మొక్కుబడిగా పరిహారం ఐదారు వేలిచ్చి చేతులు దులుపుకుని, ఇవాళ ఏదేదో మాట్లాడుతున్నారని, రైతులు ఇది గమనించాలని కోరారు. సీఎం కేసీఆర్ రైతుపక్షపాతి అని , నష్టపోయిన ప్రతిరైతును ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈయన వెంట స్థానిక సర్పంచ్, ఎంపీపీ, జడ్పిటిసి, పలు గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షంతో పంట నష్టం


నష్టపోయిన టమాట పంట చూపుతున్న రైతు

నవతెలంగాణ-రాజంపేట్

గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తీవ్రమైన పంట నష్టాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన దొడ్లే రాజు సుమారుగా 3 ఎకరాలలో టమాటా సాగుచేశారు. అకాల వర్షాలతో 3 ఎకరాల టమాట పూర్తిగా నీట మునిగింది. సుమారు లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టినట్టుగా ఆయన తెలిపారు. ప్రస్తుతం మూడు లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ

కామారెడ్డి

3

గురువారం 04 మే 2023

సీఈఐఆర్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్ల గుర్తింపు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూరు గ్రామానికి చెందిన అబ్బుమియా గత నవంబర్‌లో ఫోన్ పోగొట్టుకోగా పది రోజుల కింద పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అయితే సీఈఐఆర్ ద్వారా ఆ ఫోన్‌ను ట్రేస్ చేసి గుర్తించి అబ్బుమియాకు అప్పగించినట్టు ఎస్ఐ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు.



ఫోన్‌ను అందజేస్తున్న ఎస్ఐ

పంట పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి నరేష్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని వివిధ గ్రామంలో మంగళవారం వరకు కురిసిన వర్షాలకు నష్టపోయిన వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నరేష్ మాట్లాడుతూ.. పంట నష్టాన్ని రైతులు పొలాల వారిగా తిరిగి రైతుల జాబితాను తయారు చేస్తున్నట్టు తెలిపారు. గాంధారి, గుర్జాల్, బ్రహ్మణపల్లి గ్రామాల్లో తిరిగినట్టు తెలిపారు. అదే విధంగా పంట కోసిన రైతులు వరి ధాన్యాన్ని కుప్పలుగా పోసి టార్పాలిన్‌తో కప్పి ఉంచుకోవాలని, ఒకవేళ తడిసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టే వీలులేనప్పుడు మొలకరాకుండా, గింజ రంగుమారకుండా ఉండటానికి 20 నుంచి 50 గ్రాముల ఉప్పును లీటర్ నీటికి కలిపి తడిచిన ధాన్యంపై పిచికారీ చేస్తే గింజ రంగు మారదని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ఏఈఓలు సూర్య ప్రకాశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

జానకంపేటలో మేడే ఉత్సవాలు

నవతెలంగాణ-ఎడపల్లి


జెండా ఎగురవేస్తున్న నాయకులు

మండలంలోని జానకంపేట్ గ్రామంలో మేడేను పురస్కరించుకుని ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు మిద్దె నరేందర్ జెండాను ఆవిష్కరించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులు పడుతున్న కష్టాలను ప్రభుత్వాలు గుర్తించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మల గంగాధర్, గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన సర్పంచ్


గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన సర్పంచ్

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో సర్పంచ్ యాదగిరి బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యదర్శిని యధావిధిగా గ్రామపంచాయతీ విధుల నిర్వహణకు వచ్చేంతవరకూ తాళం తీసేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శిని పంపించిందని ఆ పంచాయతీ కార్యదర్శి వద్దంటూ తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా పీఏసీఎస్ పరిధిలోని శ్యాంరావు తాండాలో ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి చేతులమీదుగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కజొన్న ధాన్యమును ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. రైతులు అకాల వర్షాలకు మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జాకోరా పీఏసీఎస్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ హరిదాస్, ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ వీర్రాజు, ఏంసీ వైస్ చైర్మన్ గోపాల్, వైస్ ఎంపీపీ బాలరాజు, కోఆప్షన్‌మెంబర్ కరీం, సర్పంచులు సత్తిబాబు, శ్రీనగర్ రాజు, అనిత వెంకట్‌గౌడ్, తహసీల్దార్ విట్టల్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గౌడ సంఘ సభ్యులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో గుండూర్ రోడ్డు వద్ద ఉన్న సర్వాయి పాపన్న విగ్రహం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి గౌడ సంఘం మండలాధ్యక్షుడు లక్ష్మన్‌గౌడ్ సంఘం సభ్యులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కర్రేవార్ సాయాగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ప్రవేశపెట్టిన రైతు ప్రమాద బీమా తరహాలో కల్లుగీత కార్మికులకు ప్రమాదం సంభవిస్తే అదేతరహాలోనే గౌడ బీమాను ముఖ్యమంత్రి అలోచించి నేరుగా వారి ఖాతాలోనే జమ అవుతుందని నిర్ణయించడం సంతోషంగా ఉందని, అందుకే పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, బాలాగౌడ్, రవీందర్‌గౌడ్, బాలాగౌడ్, కృష్ణాగౌడ్, వినోద్ గౌడ్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయండి

- పంచాయతీ కార్యదర్శుల డిమాండ్

నవతెలంగాణ-విలేకరుల బృందం



రామారెడ్డి : సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు

జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఆరవరోజు కొనసాగింది.

గాంధారి : మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో చేపట్టిన నిరవధిక సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే 4సంవత్సరాల కాలన్ని సర్వీసుగా గుర్తించి వెంటనే గ్రేడ్ 4 సెక్రెటరీగా చేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో మండలంలోని జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సర్పంచ్‌ల మద్దతు

బోధన్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం తక్షణమే పర్మినెంట్ చేయాలని కోరుతూ చేస్తున్న సమ్మెకు సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో కూర్చుని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు శ్యరీనివాసరావు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వారి పాత్ర కీలకమని అన్నారు. వారి సమ్మెకు సర్పంచ్‌ల సంఘం తరపున సంపూర్ణ సంఘీభావం తెలుపుతున్నట్టు ఆయన ప్రకటించారు. ఆయనవెంట కొప్పర్తిక్యాంప్ గ్రామ పెద్దలు బుజ్జి, సాలంపాడ్ క్యాంప్ గ్రామ పెద్దలు తూమురవి, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులు మహేందర్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె ఆరవ రోజుకు చేరింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం పూర్తి కావడంతో రెగ్యులర్ చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ముందు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సీఐటీయూ నాయకుల మద్దతు..

ఎడపల్లి : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. జీపీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కార్యదర్శులు డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ పూర్తిగా మద్దతు తెలిపారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో వెట్టిచాకిరీ చేయిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి, మంగల్‌పాడ్, వడ్డేపల్లి, ధర్మారం, బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు వారికి మద్దతు పలికారు.

రామారెడ్డి : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆరవ రోజు పంచాయతీ జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మె కొనసాగింది. ఈ సమ్మెకు మద్దతుగా జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, స్థానిక జెడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి, పోసానిపేట సర్పంచ్ మహేందర్‌రెడ్డి బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను మోసపూరిత హామీలు, ప్రకటనలతో మోసం చేయవద్దని, వారిని క్రమబద్ధీకరణ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారికి కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు అరవింద్‌రెడ్డి, రాజేష్, బాలరాజు, నరేష్, స్రవంతి, స్వర్ణలత, వనజ, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆరవరోజు సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజు, జగన్, ప్రవీణ్, నాగరాజ్, ప్రశాంత్, సతీష్, రాజ్యలక్ష్మి, మమత, విజయలక్ష్మి, స్వాతి, రాధి, స్వరూప, స్రవంతి, దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.


సదాశివనగర్‌లో..


బోధన్‌లో..


ఎడపల్లిలో..

రైతులకు నష్ట పరిహారం అందిస్తాం

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-దోమకొండ


రైతుతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని చింతామన్‌పల్లి, ముత్యంపేట, దోమకొండ గ్రామాలలో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని, గత కొన్ని రోజులుగా కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రైతులకు నష్ట పరిహారం అందజేస్తుందని తెలిపారు. అకాల వర్షాలతో ఆందోళన చెందవద్దని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, విండో చైర్మన్ తిరుపతిగౌడ్, సర్పంచ్‌లు నర్సవ్వ, అంజలి, నాయకులు శేఖర్, నర్సరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు హాజరు కావాలి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రాజంపేట్

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు హాజరుకావాలని ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బసవన్నపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కూలీకి రూ.272 పడేలా ఈ పనులు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీవో భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-గాంధారి/పిట్లం


గాంధారి : మాట్లాడుతున్న ఎస్ఐ

సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని గాంధారి ఎస్ఐ దాన సుధాకర్ తెలిపారు. సైబర్ జాగృక్త దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధారి మండల కేంద్రంలో ప్రజలు, యువకులతో ఏర్పాటు చేసిన సైబర్ నేరాల అవగాహన సదస్సుకు ఎస్ఐ సుధాకర్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో బందిపోటు నేరాలుగాని, దొంగతనాలు గాని, దారి దోపిడీలు గాని తగ్గిపోయాయని, సీసీ కెమెరాల వల్ల, సెల్‌ఫోన్ డాటా రికవరీ వల్ల, సెల్‌ఫోన్ టవర్ లొకేషన్‌ల వల్ల ముఖ్యమైన నేరాలన్నీ తగ్గుముఖం పట్టాయని, కానీ సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని రెచ్చిపోతున్నారని అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాల పట్ల విద్యార్థి నుంచి వృద్ధుని వరకు అవగాహన లేకపోవడం వల్ల సైబర్ నేరాల బారిన పడుతున్నారని, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే అవగాహన, అప్రమత్తత చాలా ముఖ్యమైనదని ఆయన అన్నారు. ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ వాడకం చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని, అనవసరమైన అప్లికేషన్లను డౌన్లోడ్ చేయకూడదని, అపరిచిత ఫోన్‌కాల్స్‌కు సమాధానం ఇవ్వకూడదని, ఆన్లైన్ లోన్ యాప్స్‌ను వాడకూడదని, అసభ్యంగా ఉన్న అప్లికేషన్స్‌ను డిలీట్ చేయాలని ఆయన కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడమే కాకుండా, తెలియకుండా సైబర్ నేరాల బారిన పడిన వారు దరఖాస్తు ఇవ్వడానికి వెనకాడకూడదని పోలీస్ స్టేషన్‌కు రావడం ఇబ్బందిగా ఉంటే ఆన్లైన్లో దరఖాస్తును ఇవ్వాలని లేదా టోల్ ఫ్రీనెంబర్ 1930 గానీ, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లోగానీ తమ దరఖాస్తుని నమోదు చేయాలని తెలిపారు.

సైబర్ నేరం ద్వారా ఎవరైనా డబ్బు పోగొట్టుకుంటే 24 గంటలలోపల ఎన్‌సీఆర్‌పీ లేదా 1930 నెంబర్‌కు కాల్‌చేసి దరఖాస్తుని నమోదు చేస్తే పోగొట్టుకున్న డబ్బులు తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో గాంధారి ఎస్ఐ దాసు, సుధాకర్, ఏఎస్ఐ గంగారాం, కానిస్టేబుళ్లు యాదగిరి, బాలాజీ, స్వప్న, హెూంగా ర్డులు ప్రకాష్, విఠల్, మండలంలోని గ్రామాల యువకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి..

పిట్లం : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ విజయ్ కొండ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని యస్బీఐ బ్యాంక్ ఎదుట కస్టమర్‌లతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

సైబర్ నేరగాళ్లు రోజురోజుకు పెట్రేగిపోతున్నారని, అలాంటి వారిపై జాగ్రత్తగా ఉండాలని, బ్యాంక్ లావాదేవీల పిన్, ఓటీపీ నెంబర్‌లను చెప్పకూడదని సూచించారు. ప్రయాణ సమయంలో వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తూ, హెల్మెట్ ధరించి ప్రాణాలను దక్కించుకోవాలని, వాహనాలను అతివేగంగా, అజాగ్రత్తగా నడపరదాని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆర్గొండ పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను బుధవారం ప్రారంభించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చెస్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ బాల్ నర్సింలు, వార్డ్ మెంబర్ శంకర్, పీఈటీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తే చర్యలు

- తహసీల్దార్ రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-పిట్లం

వరి కోత మిషన్ యజమానులు రైతుల వద్ద నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు. మండల వ్యాప్తంగా అకాల వర్షాల వల్ల రైతులు ఎంతో నష్టపోయారని, అలాంటి వారి వద్ద నుంచి వరి కోత మిషన్ యజమానులు అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఇకమీదట నష్టపోతున్న రైతులను దృష్టిలో పెట్టుకొని వారికి ఇబ్బందులు కలగకుండా, మానవతా దృక్పథంతో గిట్టుబాటు అయ్యేలా తక్కువ డబ్బులు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారమందితే వరి కోత మిషన్ యజమానులపై తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి రూ.10వేలు విరాళం

నవతెలంగాణ-లింగంపేట్


విరాళం అందజేస్తున్న దృశ్యం

మండలం బాయంపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి గుడికి టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్మోహన్ రూ.10 వేల విరాళాన్ని మంగళవారం అందజేశారు. గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. గ్రామంలో హనుమాన్ ఆలయం నిర్మాణం చేపట్టడం గ్రామస్తులకు యువకులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్లమడుగు షరీఫ్, కాంగ్రెస్ నాయకులు, హనుమాన్ ఆలయ భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డూర్ ఎల్లారెడ్డిలో ప్రారంభమైన క్రీడాపోటీలు


క్రీడ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్డూర్ ఎల్లారెడ్డి గ్రామంలో సమ్మర్ క్యాంప్ క్రీడా పోటీలను మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి, వాదుల నవీన్‌రెడ్డి, పయ్యావుల నరేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు నగేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు అనేవి మానసికోల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. క్రీడలతో విద్యార్థులు శక్తివంతమైన సామర్థ్యాన్ని ఎంచుకుంటారని తెలిపారు.

ఏపివోగా పోశెట్టి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఏపివో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోగా పోశెట్టి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏపీవో గా ఉన్న మంజుల అక్రమాలకు పాల్పడ్డారని తనిఖీలలో వెలుగు చూడగా ఉన్నతాధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. ఇప్పటినుండి ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ లకు అధనపు బాధ్యతలను అప్పగించి నెలలు గడిపారు. పూర్తిస్థాయిలో ఎట్టకేలకు పోశెట్టికి బాధ్యతలను అప్పగించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం


దాతను సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన కొమ్ముల శేఖర్ రెడ్డి, బుజ్జి దంపతులు రూ. లక్ష విరాళం అందజేశారు. బుధవారం విరాళం మొత్తాన్ని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. వారిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్, అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, చంద్రశేఖర్, అంగరి దినేష్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించండి

- సమ్మె నోటీసు అందించిన పంచాయతీ సిబ్బంది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/డిచ్‌పల్లి

ఈనెల 5లోగా గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు స్పష్టం చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో సంతోష్ రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల గౌరవ అధ్యక్షులు వెంకటరమణ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్లను మల్టీపర్పస్ విధానం నుండి మినహాయించి పంచాయతీ కార్యదర్శికి అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిలుగా ప్రత్యేక హెూదా కల్పించి రూ.21వేల 500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇతర పంచాయతీ సిబ్బంది అందరికీ 51 జీవో సవరించి కేటగిరీల వారిగా హెూదాలు కల్పించి కనీస వేతనం రూ.15వేల500 ఇవ్వాలన్నారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేదనను వెంటనే చెల్లించాలన్నారు. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బంది అందరికీ గ్రామ పంచాయతీ నిధుల నుండి కాకుండా నేరుగా ప్రభుత్వమే సిబ్బందికి అకౌంట్లో వేయాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది అందరికీ ఉద్యోగ భద్రత కల్పించి, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈనెల 5వ తేదీన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే నిరాధిక సమ్మెకు వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్‌కు గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె నోటీసులను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తలారి రాజేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాజే సాహెబ్, గౌడ పోచయ్య, మండల సపాయిలు, ఎలక్ట్రిషన్, పంపు ఆపరేటర్స్ సిబ్బంది పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి:వినతి ప్రతం అందజేస్తున్న ప్రంచయితి సిబ్బంది


డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి:

తమ సమస్యల పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ 05 నుండి చేపట్టనున్నా సమ్మెకు సహకరించాలని కోరుతూ డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి సర్పంచ్ సతీష్ రావుకు కారోబార్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కరోబార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిఎల్ఇడి కోసం దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని డిఇఓ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని డి.ఈఎల్.ఈడి. (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కోసం అభ్యర్ధుల డిఈఈ సెట్ 2023, ప్రభుత్వ డైట్ కళాశాల, ప్రైవేటు అన్ ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఇన్‌క్లుడింగ్ మైనారిటీ నాన్ మైనారిటీ) లో రెండు సంవత్సరాల కోర్సు , బ్యాచ్ 2023 - 25 ఆన్లైన్ దరఖాస్తులను స్వీకరించుటకు http:// dee cet, cdse telangana. gov.in వెబ్ సైట్ ను సందర్శించి అభ్యర్థులు వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలఅని పేర్కొన్నారు.

జాగ్రతలు తీసుకుని ధాన్యాన్ని కాపాడాలి

- అడిషినల్ కలెక్టర్ చంద్రశేఖర్


మాట్లాడుతున్న అడిషినల్ కలెక్టర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని తగు జాగ్రత్తలు తీసుకుంటూ కాపాడుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం డిచ్ పల్లి మండలంలోని బర్దిపూర్ సహకార సొసైటీ పరిధిలోని ధర్మారం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున జాగ్రత్తతో వరి ధాన్యాన్ని కాపాడుకోవాలని రైతులను కోరారు. వరి ని వెంటదివెంట కొనుగోలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ రావు, సొసైటి చైర్మన్, రైతులు తదితరులు ఉన్నారు.

జూనియర్ పంచాయతీ సెక్రెటరీల వంటావార్పు


వంటావార్పు చేస్తున్న జూనియర్ సెక్రెటరీలు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ సెక్రటరీలు వంట వార్పుతో తమ నిరసన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు మాట ఇచ్చిన ప్రకారం రెగ్యులర్ చేయాలని, సీఎం కొత్త సెక్రటేరియట్ ప్రారంభోత్సవం సందర్భంగా కొంతమందికి కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం శుభసూచకమని అన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న తొమ్మిది వేల మంది పంచాయతీ సెక్రెటరీలను రెగ్యులర్ చేయాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. పంచాయతీ సెక్రెటరీ మృదుల మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకొని రెగ్యులర్ చేస్తే సమ్మెను విరమిస్తామని, ముఖ్యమంత్రి గారు గానీ పంచాయతీ శాఖ మంత్రి గారు గానీ తమ బాధను అర్థం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ధీరజ్, హరీష్, నర్సింలు, మోహన్, వెంకట్, శ్యామ్, సునీత, పద్మజ, సంధ్య, రాజు తదితులు పాల్గొన్నారు.

గంగపుత్రులు కలసికట్టుగా పనిచేసుకోవాలి


విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-సిరికొండ

గంగపుత్రులు కలసికట్టుగా పనిచేసుకోవాలని ధర్పల్లి జడ్పిటిసి, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవానికి బుధవారం ఆయన విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో గంగపుత్రుల సంఘం సభ్యులు, సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, పలుగ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలభవన్‌లో ఇంద్రజాల ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వేసవి శిక్షణా తరగతులలో భాగంగా జిల్లా బాలభవన్లో రంగనాథ్ ఇంద్రజాల ప్రదర్శన అబ్బుర పరచింది. దాదాపు గంటన్నరపాటు సాగిన ప్రదర్శనలో ఎన్నెన్నో వింతలను ఆవిష్కరించారు. ప్రదర్శన ఆరంభమైనది. మొదలు నుంచి ముగిసేంత వరకు చప్పట్లు, అరుపులు కేరింతలతో బాలభవన్ మారుమోగి పోయింది. మండుతున్న మంటను) జ్వాలను చేతిలో పట్టుకుని వేదిక మీదికి వచ్చిన జాదు యుగంధర్ రంగనాథ్ మ్యాజిక్ స్టిక్‌గా మార్చగానే చప్పట్లు మారు మోగాయి. నోట్ల వర్షం కురిపిచటంతో పాటు, కరెన్సీ కట్టలు, పూల గుత్తులు, రంగు రంగు డబ్బాలు సృష్టించారు, తలమీద మంటలు పెట్టి టీ తయారు చేసి తాగించారు. బెలూన్ లో నీడిల్ గుచ్చి బెలూను పగలక పోవటం. చిన్న మజా వాల్లు పెద్ద థమ్స్ అప్ లాటిల్‌గా మార్చి ఆశ్చర్య పరచారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ పిల్లలకు అత్యంత ఇష్టమైన ఈ మ్యాజిక్ లో మాయలు మంత్రాలు లేవని, పిల్లలకు ఈ విద్యను నేర్పుతున్నామని అన్నారు. బాలభవన్ సూపరింటెండెంట్ విఠల్ ప్రభాకర్ బాల మాట్లాడుతూ పిల్లలలోని సృజనాత్మకతకు పదును పెట్టేదే బాల భవన్ అని అన్నారు. అనంతరం వారు రంగనాథ్ ను సత్కరించారు. కార్యక్రమంలో ఉమనాల వెంకటలక్ష్మి, పుష్పలత, అర్చన, కల్పన, లక్ష్మన్, లత పాల్గొన్నారు.


బొకేలు అందజేస్తున్న చిన్నరులు


ప్రదర్శన ఇస్తున్న రంగనాథ్

6వ రోజు కార్యదర్శుల సమ్మె


కమ్మర్‌పల్లిలో..

నవతెలంగాణ-భీంగల్/కమ్మర్‌పల్లి

తమను రెగ్యులర్ చేయాలని కోరుతు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె బుధవారం 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్బంగా మహిళా పంచాయతీ కార్యదర్శులు తమ చిన్న పిల్లలతో కలిసి సమ్మెలో కూర్చున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు సీఎం కేసీఆర్ తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించి ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ సమ్మెలో శేఖర్ , గణేష్, కిషన్, శ్రీకర్, మాలావత్ రాజు,విజేంధర్, జితెంధర్,సంజయ్, హేమ, అనూష తదితరులున్నారు, పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు కారోబార్ ల మద్దతు

కమ్మర్‌పల్లి:జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ అండ్ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శిబిరం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులను కలిసి సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ అండ్ సిబ్బంది యూనియన్ మండల గౌరవ అధ్యక్షులు వెంకట రమణ, మండల అధ్యక్షులు తలారి రాజేశ్వర్ మాట్లాడితూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.... ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2019 ఏప్రిల్ 11న మూడు సంవత్సరాల ప్రొబిషన్ కాలపరిమితితో ఉద్యోగాలలో చేరడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మరొక సంవత్సరం ఈ ప్రొహిబిషన్ కాల పరిమితిని పెంచడం జరిగిందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి విధించిన నాలుగు సంవత్సరాల కాల పరిమితి ఈ ఏప్రిల్ 11వ తేదీతో పూర్తయిం దన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను, కరోనా సమయంలో ఇంటింటి సర్వే, పల్లె ప్రగతి, పోడు భూములు, కంటి వెలుగు వంటి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశామ న్నారు. నాలుగు సంవత్సరాల ప్రొబిషన్ కాల పరిమితిని సర్వీస్‌గా పరిగణించి రెగ్యులరైజ్ చేసి 9వేల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలను ఆదుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్ నిర్ధారించి ప్రకటించాలని డిమాండ్ చేశారు. శిబిరంలో డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రజిత, జులేఖ, శ్రీలత, సంధ్య, ఎస్. నవీన్, శ్రీకాంత్, విజయ్, ఏ.నవీన్, తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ అండ్ సిబ్బంది యూనియన్ మండల గౌరవ అధ్యక్షులు వెంకట రమణ, మండల అధ్యక్షులు తలారి రాజేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాజే సాహెబ్, గౌడ పోచయ్య, మండల సపాయి, ఎలక్ట్రిషన్, పంపు ఆపరేటర్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కల్పించడం హర్షనీయం

- సర్పంచ్ మోహన్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహిళలకు ఉపాధి కల్పించడం హర్షనీయమని సర్పంచ్ మోహన్ రెడ్డి అన్నారు. గన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రెస్టారెంట్‌లో "రవి కిరణ్ ప్రాజెక్ట్" పేరుతో రూరల్ ఏరియాలో గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి కల్పించాలనే ప్రధాన ఉద్దేశంతో కూరగాయల ద్వారా, పండ్లతో సోలార్ ద్వారా, పాలీ హౌస్ ద్వారా డ్రై చేసి స్వీట్ ను తయారు చేసే విధానాన్ని పరిశీలించి, సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ను గన్నారం గ్రామంలో ఉండటానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి కల్పించిన నేషనల్ హై వే అథారిటీ "ఆతాంగ్" "రవి కిరణ్ ప్రాజెక్టు" మేనేజ్ మెంట్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌తో గన్నారం గ్రామ మహిళలకు ఉపాధి కల్పించడం చాలా ఆనందించ దగ్గ విషయమన్నారు. ఈ ప్రాజెక్టు విస్తరిస్తే గన్నారం మహిళలకే కాకుండా ఇంకొంత మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు దినదినాభివృద్ధి చెంది ఇతర గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి కల్పించాలని సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి కోరారు.



కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా

- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హామీనిచ్చారు. ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న శివాలయం వద్ద కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో టిఎస్ ఆర్టీసీ చైర్మన్ %డ% నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ను కలిసి శాలువాతో సత్కరించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి చింతలదాస్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బీరీష్ శేట్టి, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తిర్మన్ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయాలని విన్నవించిన వేంటనే ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సానుకూలంగా స్పందించి నీదులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. గ్రామంలో అత్యవసరంగా ఉన్నవాటికి నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ చింతల దాస్ ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ను కలిసిన వారిలో గ్రామ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు దర్శపు గంగాధర్, మేకల చిన్న మల్లేశ్, రాజనర్సాగౌడ్, కుమ్మరి పెద్ద గంగారం, చెన్న రమేష్, ధర్పల్లి సాయి రెడ్డి తోపాటు తదితరులు ఉన్నారు.


ఎంఎల్ఏను సన్మానిస్తున్న నాయకులు

కారేపల్లిలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని కారేపల్లి గ్రామంలో బంతిలాల్ అనే వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై రాజ్‌భరత్ రెడ్డి వివరాల ప్రకారం.. కారేపల్లికి చెందిన మృతుడు బంతిలాల్ ఇంటికి వెళ్లే దారిలో రోడ్డులో కట్టెలు అడ్డంగా వేసి ఉండడంతో ఈ విషయై గ్రామానికి చెందిన వాట్సప్ గ్రూప్‌లో షేర్ చేశారు. ఈ విషయమై మనసులో పెట్టుకున్న పక్కింటి ధరావత్ మంత్, ఆయన భార్య లలిత, దేవి చంద్, ఆయన భార్య లావణ్య వారి తల్లి అంబలిదేవి బంతిలాల్ ఇంటికి వెళ్లి తలుపులు ధ్వంసం చేసి బెదింరించారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో దుకాణం వద్ద కూల్ డ్రింక్ తాగుతున్న బంతిలాల్‌పై ఐదుగురు మూకుమ్మడిగా దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఆయన భార్య నవీన వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సందీప్ కుమార్ వివరాల ప్రకారం.. కోటగల్లికి చెందిన అగ్గు లావణ్య (42) గృహిణి మానసిక స్థితి సరిగా లేదు. ఎల్లమ్మ గుట్ట లోని ఆమె తల్లి గారింట్లో ఉంటోంది. చికిత్స చేయించినను తగ్గలేదు. గతనెల 30న రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె తన నైటికి నిప్పు అంటించుకొని ఆత్మ హత్యకు ప్రయత్నించింది. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రి లో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మరణించింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బషీరాబాద్‌లో తైబజార్ వేలంపాట


మాట్లాడుతున్న సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సక్కారం అశోక్ అధ్యక్షతన బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తైబజార్ నిర్వహణ కోసం వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో పాటలో గ్రామానికి చెందిన కానిగెల కాశీరాం రూ. 60వేల అత్యధికంగా పాటపాడి వేలాన్ని దక్కించుకున్నారు. సంవత్సరం కాలానికి గాను కాశీరాంకు తైబజార్ అప్పజెప్పినట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు శ్యామ్, సాగర్, నాయకులు సక్కారం నారాయణ, నెల్ల రమేష్, రాజు, సాయిలు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ రాజేందర్‌కు ఘననివాళ్లు


నివాళు అరిపిస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు కామ్రేడ్ ములుగు రాజేందర్ రెండోవర్ధంతి బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. భూ పోరాట నాయకుడు, నిస్వార్ధపరుడు, కామ్రేడ్ రాజేందర్ కరోనా కాటుకు బలై అమరుడయ్యాడు. పీడిత ప్రజానీకానికి, సిపిఐ ఎంఎల్ పార్టీకి తీరని లోటని, ప్రజాపంథానాయకుడు కామ్రేడ్ ఎం సాయ రెడ్డి అన్నారు. కామ్రేడ్ రాజేందర్ ఏ లక్ష్యసాధన కోసమైతే చివరివరకు నిలబడ్డాడో, ఆయన ఆశయ సాధనకు ప్రజానీకాన్ని చైతన్య పరచడమే నిజమైన నివాళు లు అర్పించిన వాళ్ళమవుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ములుగు పండరి, ఎం.లింబయ్య, అనీష్, మనోజ్, సంతోష్ నాగన్న, గంగాధర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

మొలకత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

- ఎఫ్‌పీఓ చైర్మన్ మచర్ల నాగయ్య


మాట్లాడుతున్న చైర్మన్ మచర్ల నాగయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అకాల వర్షాలకు, వడగండ్ల వానలకు, రైతులకు చేతికొచ్చిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. నీటిలో తడిసిన ధాన్యానికి మొలకలు వచ్చాయని, రాళ్లవానలకు పొలాల్లోనే వడ్లు రాలిపోయాయని, ప్రభుత్వం వెంటనే తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని, మొలకలొచ్చిన ధాన్యాన్ని, కొనుగోలు చేయాలని, డిచ్‌పల్లి ఎఫ్‌పీఓ చైర్మన్ మచ్చర్ల నాగయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో నాబార్డు ఈక్విటీ గ్రాంట్‌కు ప్రతిపాదనలు పంపామని గ్రాంట్ రాగానే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సరిపడా నాణ్యమైన విత్తనం, ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేస్తామని అన్నారు. కల్తీ విత్తనాల, ఎరువుల వ్యాపారుల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశం లో డైరెక్టర్లు కొండేల సాయిరెడ్డి, వేల్పూర్ భూమ్మయ్య, ఆకుల పాపన్న, మమ్మాయి రాజన్న, పెంటయ్య, వెంకటరెడ్డి, అఖిల, వి. సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.